తెలంగాణ భాష.. యాసే శ్వాస



తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, జానపద గేయాలకు ఉమ్మడి జిల్లా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. నేడు తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



'నానో'పై వెనుకడుగు

కొరత నేపథ్యంలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని అధికారులు సూచిస్తున్నారు. అయినా రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.5 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లా కేంద్రంలో జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో గల టాస్క్ కేంద్రంలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి రవికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో కంపెనీ(హైదరాబాద్)లో జూనియర్ ఆఫీసర్(అర్హత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ) 40 పోస్టులు, జూనియర్ కెమిస్ట్/ ట్రెయినీ(అర్హత బీఎస్సీ కెమిస్ట్రీ, బీఏ, బీకామ్) 100 పోస్టులు, జూనియర్ ఇంజినీర్/ట్రెయినీ(అర్హత ఐటీఐ/డిప్లొమా ఇన్ మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్) 200 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 90598 88389, 77022 84181 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్ల లక్ష్మి అనే మహిళ పెద్దపులి దాడిలో మృతి చెందిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే హరీశ్‌బాబు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మృతురాలి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రికి సమస్యను వివరించారు. లక్ష్మి మృతి చెందిన సమయంలో ఉన్నతాధికారులు కొంత నగదుతోపాటు ఐదెకరాల సాగుభూమి ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్, మృతురాలి కుటుంబ సభ్యులు వసంతరావు, విమల, వాసుదేవ్ ఉన్నారు.

పీజీసెట్‌లో 63వ ర్యాంకు



ప్రవీణ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన బొమ్మళ్ల రాజయ్య, ఇందిర దంపతుల కుమారుడు ప్రవీణ్ సోమవారం విడుదలైన పీజీసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగంలో 63వ ర్యాంక్ సాధించాడు. స్వగ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాడు. ఇచ్చోడలోని టీజీ డబ్ల్యూఆర్‌జేసీలో ఇంటర్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాడు. అనంతరం ఉచిత కోచింగ్ తీసుకుని పీజీ ప్రవేశ పరీక్షల్లో 63వ ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో చదువుకుని ర్యాంక్ సాధించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

శిక్షణ అభ్యర్థులకు పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న శివకుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖాదీ గ్రామోద్యోగ్ ఆధ్వర్యంలో వృత్తి విద్య శిక్షణ పొందిన అభ్యర్థులకు గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో సోమవారం రాత పరీక్షలు నిర్వహించారు. ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్, మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. గోలేటిలోని కేంద్రాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన సింగరేణి సేవా సమితి సమన్వయకర్త డీఎస్ శివకుమార్ సందర్శించారు. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా గోలేటిలో ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మాదారంలో మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులు నిర్వహించారు. శిక్షణ పొందిన మహిళలు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సింగరేణి సేవా సమితి ఏరియా కోఆర్డినేటర్ అంజయ్య, శిక్షకులు శ్రీదేవి, రూప, శైలజ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా వెతలు

- రెబ్బెన, కాగజ్‌నగర్‌లో రైతుల ఆందోళనలు
- టోకెన్లు ఉన్నా బస్తాలు అందించడం లేదని అధికారులపై ఆగ్రహం
- రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన



యూరియా కోసం రెబ్బెన హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

రెబ్బెన/కాగజ్‌నగర్‌రూరల్: యూరియా కోసం జిల్లా రైతుల వెతలు తీరడం లేదు. ఎరువులు వేసే అదును దాటిపోతుండటంతో అన్నదాతలు వ్యవసాయ సహకార సంఘాల కార్యాయాల ఎదుట బారులుదీరుతున్నారు. సరిపడా పంపిణీ చేయకపోవడంతో ఆందోళనలకు దిగుతున్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు వచ్చిన యూరియాను రైతులకు పంపిణీ చేయకుండా సోమవారం అధికారులు కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సుమారు 40 నిమిషాలపాటు రోడ్డుపై ధర్నా చేయడంతో రోడ్డుకిరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటలకు మూడో దఫా మందులు వేయాల్సి ఉండగా యూరియా కోసం పీఏసీఎస్‌కు వచ్చామన్నారు. టోకెన్లు ఉన్నప్పటికీ యూరియా అందించకుండా కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలను వదిలేసి.. బస్తాల కోసం రోజుల తరబడి పీఏసీఎస్ చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. విషయం తెలుసుకున్న సీఐ సంజయ్ ఘటనాస్థలికి చేరుకుని రైతులకు సర్దిచెప్పినా వారు ఆందోళన విరమించలేదు. దీంతో వ్యవసాయ శాఖ, పీఏసీఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



కాగజ్‌నగర్‌లో గుమిగూడిన రైతులు

కాగజ్‌నగర్‌లో ఆందోళన

యూరియా కోసం టోకెన్లు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా యూరియా ఇవ్వకపోవడంతో రైతులు సోమవారం కాగజ్‌నగర్‌లో ఆందోళనకు దిగారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. టోకెన్లు జూలై, ఆగస్టులోనే ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు బస్తాలు అందించలేదని ఆరోపించారు. సుమారు గంట వరకు ఆందోళన కొనసాగించారు.

సీఐ కాళ్లపై పడిన రైతు



సీఐ కాళ్లు మొక్కుతున్న రైతు

పంటలకు కావాల్సిన యూరియా బస్తాలు అందించేలా చూడాలని రెబ్బెన మండలం నవేగాంకు చెందిన ఓ రైతు సీఐ సంజయ్ కాళ్లపై పడి వేడుకున్నాడు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తుండగా అక్కడికి సీఐ సంజయ్ వచ్చారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తూ తమను ఇబ్బందులపాలు చేస్తున్నారని, వెంటనే యూరియా ఇచ్చేలా చూడాలని రైతు సీఐ కాళ్లపై పడ్డాడు. అక్కడే ఉన్న సిబ్బంది అతడిని పైకి లేపారు. పీఏసీఎస్‌కు వచ్చిన ఒక్క లారీ లోడు యూరియా టోకెన్లు ఉన్నవారిలో సగం మందికి కూడా సరిపోలేదు.

'ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు కష్టాలు'

కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు యూరియా కష్టాలు ఎదురవుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు. జూలై, ఆగస్టులో టోకెన్లు ఇచ్చి ఇప్పటివరకు యూరియా పంపిణీ చేయకపోవడం సరికాదన్నారు. పొలాల్లో పని చేసుకోవాల్సిన రైతులు రోడ్లు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సరిపడా యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతున్నారన్నారు. సరిపడా అందుబాటులో ఉంటే రైతులు రోడ్లపైకి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు యూరియా బస్తా ఒకటి రూ.700 చొప్పున బ్లాక్‌లో అమ్ముకుంటూ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. లారీలు వచ్చినా బయోమెట్రిక్ మిషన్లు లేవనే కారణంతో యూరియా ఇవ్వడంలేదని, ఈ విషయాన్ని ఆయన జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వ్యవసాయ, పీఏసీఎస్ అధికారులతో మాట్లాడారు. దీంతో యూరియా బస్తాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యామ్‌రావు, కొంగ సత్యనారాయణ, మండల కన్వీనర్ అంజన్న, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రేపు ప్రాదేశిక ఓటర్ల తుది జాబితా

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10న ప్రాదేశిక ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుదిజాబితా విడుదల చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణతో కలిసి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 జెడ్పీటీసీ, 127 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 6న ముసాయిదా జాబితా ప్రదర్శించామని, అభ్యంతరాలు పరిశీలించి 10న తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

భూభారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

భూ భారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావు, భూకొలతల అధికారి సోమేశ్వర్ రావుతో కలిసి తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, మండల సర్వేయర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, పోర్టల్ ద్వారా ఐదు వేల వరకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పదిరోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

విద్య ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: సమాజంలో ప్రతీఒక్కరికి విద్య ప్రాముఖ్యతపై అవగాహన అవసరమని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లాస్థాయి వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఐక్యత, సామాజిక బాధ్యత, విద్య ప్రాముఖ్యతను అందరికీ వివరించాలన్నారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో కాగజ్‌నగర్ మైనార్టీ గురుకులానికి చెందిన అద్నాన్, జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ చెందిన వైష్ణవి చిత్రలేఖన పోటీలు, సాహితి స్లోగన్‌లో ప్రథమ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, ప్రిన్సిపాళ్లు మహేశ్వర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి

ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, దివ్యాంగులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు మంజూరు చేసి, ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వారికి పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి థామస్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఒంటరి మహిళలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, అలాగే క్యాన్సర్, ఎయిడ్స్, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.15వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. హామీ అమలు చేయకుంటే ఎన్నికల్లో బుద్ధి చెప్తామన్నారు. అలాగే ఎమ్మెల్యేల ఇళ్లు కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇన్‌చార్జి మల్లేశ్, జాతీయ ఉపాధ్యక్షుడు కేశవ్‌రావు, నాయకులు మూర్తి, శ్రీశైలం, విఠల్, మహేశ్, రాజయ్య, మల్లమ్మ, పెంటుబాయి, గోపాల్, మనోహర్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీంచి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా పైరవీలు లేకుండా పోలీసుల సేవలు వినియోగించుకుంటూ, సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు.

ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దు

ఆన్‌లైన్ ఆఫర్లు, వివిధ ప్రకటనల పేరుతో వచ్చే ఏపీకే ఫైల్స్, లింక్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ఆఫర్లు, డిస్కౌంట్లు అంటూ ఫేక్ లింక్స్‌తో బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారని, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా సైబర్ మోసగాళ్లు ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి లింక్స్ ఇతరులకు ఫార్వర్డ్ చేయొద్దని, మోసపూరిత లింక్స్ గుర్తిస్తే 1930కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాల నియంత్రణకు అప్రమత్తతే ప్రధాన ఆయుధమని, ప్రజలు మోసాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

లైంగిక వేధింపుల నిరోధానికి చర్యలు

ఆసిఫాబాద్: మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి అడెపు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పని ప్రదేశాలు, సమాజంలో మహిళలపై ఎదురయ్యే లైంగిక వేధిపుల నిరోధానికి పోష్ యాక్ట్ 2013 అమలు చేస్తూ గౌరవంగా పనిచేసుకునే వాతావరణం కల్పిస్తామన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధింపులకు పాల్పడటంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసే మహిళలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని స్పష్టం చేశారు. బాధితులు కమిటీలో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం, జిల్లా సమన్వయ కర్త శారద, డాక్టర్ అనూషరాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి భాస్కర్

కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌సీడీ ప్రోగ్రాంలో ఆన్‌లైన్ పనుల నుంచి విముక్తి కల్పించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్ మాట్లాడుతూ పదేళ్లుగా ఏఎన్‌ఎంలు ఎన్‌సీడీ ఆన్‌లైన్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజుకు 12 గంటల పాటు విధుల్లో ఉండటంతో వారిపై పనిభారం పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎన్‌సీడీ ప్రోగ్రాం నుంచి ఏఎన్‌ఎంలకు విముక్తి కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి, ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఏఎన్‌ఎంలు సునీత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

ప్రజావాణికి అర్జీల వెల్లువ

- అధికారులకు సమస్యలు ఏకరువు పెట్టిన బాధితులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్జీలు వెల్లువలా వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు విన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ మండలం జంబుగకు చెందిన డోంగ్రి రాంబాయి తన తండ్రి పేరుతో ఉన్న భూమిని వారసులమైన తమకు తెలియకుండా ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరింది. రెబ్బెన మండలం కొండపల్లికి చెందిన గుర్లె సత్తయ్య తమ గ్రామం నుంచి జాతీయ రహదారికి ఉన్న అప్రోచ్ రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరాడు. రేకుల ఇంటిలో నివాసం ఉంటున్న దివ్యాంగుడినైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన రమేశ్ దరఖాస్తు చేసుకున్నాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన బానోత్ మంగ కోరింది. తన భర్త మరణించాడని, వితంతు పింఛన్ మంజూరు చేయాలని జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన జాదవ్ రోహిణి విన్నవించింది. తనకు జారీ చేసిన పెన్షన్ పుస్తకంలో ఆధార్ నంబర్ సరిచేయాలని కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లికి చెందిన చాపిడి మీరాబాయి అర్జీ సమర్పించింది. జైనూర్ మండలం బూసిమెట్ట క్యాంపునకు చెందిన వృద్ధులు తమకు పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

బ్యాంకు రుణం ఇవ్వడం లేదు

మేము జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెందిన లక్ష్మీ మహిళా సంఘం సభ్యులం. ఐదు నెలల క్రితం పాత రుణం బ్యాంకులో చెల్లించాం. వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఈ ఏడాది మళ్లీ బ్యాంకు రుణం ఇవ్వలేదు. అధికారులు వెంటనే రుణం మంజూరు చేయాలి.



– రాజంపేట మహిళలు, మం.ఆసిఫాబాద్

పింఛన్ ఆగింది



నేను కొన్నేళ్లుగా వృద్ధాప్య పింఛన్ పొందుతుండగా మూడు నెలలుగా ఆగిపోయింది. ఆధార్ కార్డులో అడ్రస్ మార్చకపోవడంతో పింఛన్ నిలిపివేశామని చెబుతున్నారు. అధికారులు స్పందించి పింఛన్ పునరుద్ధరించాలి.

– పొద్మం మీరాబాయి, లోనవెల్లి, మం.సిర్పూర్-టి

విధుల్లోకి తీసుకోవాలి



తిర్యాణి మండలం పంగిడి మాదర ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాను. ఇంటి నుంచి పాఠశాలకు వచ్చే ఓ విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందితే నన్ను విధుల నుంచి తొలగించారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాను. తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– స్రవంతి, పంగిడిమాదర, మం.తిర్యాణి

రేషన్‌కార్డు జారీ చేయాలి



నిరుపేదరాలినైన నాకు ఒక కుమార్తె ఉంది. నా భర్త చనిపోయాడు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాను. రేషన్‌కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు కూడా అందడం లేదు. రేషన్ కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

– టీరెల్లి స్రవంతి, లోనవెల్లి, మం.సిర్పూర్– టి

క్లుప్తంగా

13న చదరంగం పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని బురదగూడెంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఈనెల 13న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అండర్–15 విద్యార్థులకు చదరంగం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనుకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 6305502409 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తానూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జాదవ్ దినేష్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. బాధితుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు ఇంటి వెనుక నుంచి లోనికి చొరబడి బీరువాలో ఉన్న ఒకటిన్నర తులాల నకలేష్, 5 గ్రాముల చెవి కమ్మలు,7 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరించారు. సోమవారం దినేష్ ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై షేక్ జుబేర్ సంఘటన స్థలాన్ని పరిశీలించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భూ పంచాయతీ విషయంలో అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీవాణి సోమవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయాల అధికారి డల్లు సింగ్ తెలిపారు. 2022లో లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన జాడ రజనీకాంత్ భూమి విషయంలో అన్నతో గొడవపడి కత్తితో దాడి చేశాడు. బాధితుని భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో రెండేళ్లు..

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలక్రైం: మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడి కులంపేరుతో దూషించిన ఒకరికి సోమవారం ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించినట్లు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి జి. రాఘవేందర్ తెలిపారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజారాంపల్లికి చెందిన గన్నేరువరం నర్సయ్య మంచిర్యాల జిల్లా సీసీసీ నాగార్జున కాలనీలో నివాసం ఉంటున్న ఎస్సీ కుటుంబానికి చెందిన ఓ మహిళ ఇంటికి గ్యాస్ డెలివరీ చేయడానికి వచ్చి ఆమెతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించాడు. మహిళ గట్టిగా అరవడంతో బైక్‌పై పారిపోయాడు. 2020 నవంబర్ 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జైపూర్ ఏసీపీ నర్సయ్యపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టగా పీపీ రమణారెడ్డి 11 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చి నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మతసామరస్యాన్ని దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన కొండ గణేశ్, గౌతమ్, వాఘ్మారే ప్రశాంత్, ఎం.మునీశ్వర్, మహేష్ ఎమ్మెల్యేతో పాటు అధికారులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా వాట్సాప్‌లో పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. వీటిని గ్రూపుల్లో షేర్ చేసి గొడవకు దారితీసేలా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు పెట్టినా, షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లతో పాటు పోస్టులను షేర్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మతసామరస్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గురుకులంలో 16 మంది విద్యార్థులకు అస్వస్థత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్‌లోని చందనపూర్ పునరావాస కాలనీలో గల తెలంగాణ అర్బన్ గురుకుల పాఠశాలలోని 16 మంది విద్యార్థులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలోని తరగతి గదుల్లో సోమవారం దోమల నివారణకు క్రిమిసంహారక మందు స్ప్రే చేయించారు. అనంతరం లోపలికి వెళ్లిన విద్యార్థుల ముఖంపై దురదతో కూడిన దద్దుర్లు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గమనించిన పాఠశాల యాజమాన్యం రాత్రి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గురుకుల పాఠశాలలో పరిమితికి మించి క్రిమిసంహారక మందు వినియోగించి స్ప్రే చేయించడంతో విద్యార్థుల అస్వస్థతకు గురైనట్లు తెలిసింది.

తెలంగాణ భాష.. యాసే శ్వాస

- ప్రాంతీయ మాండలికంతోనే భాషకు మనుగడ
- భాష, యాసలో ప్రత్యేకత కనబర్చుతున్న సాహితీవేత్తలు
- నేడు తెలంగాణ భాషా దినోత్సవం



బాల రచయితలతో తెలుగుభాషోపాధ్యాయుడు కొండూరి పోతన్న

తెలంగాణ యాసలో జిల్లా కవుల రచనలు కొన్ని...

'అవును...నేను ఆదిలాబాదోన్నే', మట్టిగోడలు, స్వేచ్ఛకు సంకెళ్లు, పత్తిపూలు, కచ్చురం, అడవి(నవల), కొలిమి అంటుకుంది, నిరుడు కురిసిన కళ, జంగూబాయి.

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మాతృభాష ప్రాధాన్యతను చాటేలా తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, జానపద గేయాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. సామాన్యుడి భాష, యాస ద్వారా సమస్యలపై గళం విప్పిన కాళోజీ స్ఫూర్తితో జిల్లాకు చెందిన పలువురు తెలుగు భాషోపాధ్యాయులు, కవులు, సాహితీవేత్తలు, బాలరచయితలు ప్రత్యేకత కనబర్చుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థానిక భాషల్లో వైవిధ్యం కనిపిస్తుంది. వివిధ రకాల యాసలతో పాటు భాషా మాండలికాలు వాడుకలో ఉన్నాయి. జిల్లాకు చెందిన కవులు కూడా తమ రచనల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ భాష పరిరక్షణకు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 9న సహజకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఏటా తెలంగాణ భాషాదినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం..

వ్యవహారికమే భాషకు ఆయువుపట్టు...

తెలంగాణ భాషకు స్థానిక ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషనే ఆయువుపట్టుగా ఉంటుంది. తెలంగాణ యాసలో 'అవును..నేను ఆదిలాబాదోన్నే' అనే కవిత సంకలనాన్ని జిల్లాకు చెందిన సాహితీవేత్త అప్పాల చక్రధారి రచించారు. వందలాది మందితో మమేకమయ్యే సందర్భంలోనే భాషకు ఉన్న విభిన్న కోణాలు తెలుసుకోగలుగుతామని ఆయనంటారు. కవులు, రచయితలు తెలంగాణ యాస, భాష ప్రతిబింబించే రచనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా తెలంగాణ భాషను ముందు తరాలకు అందివ్వగలుగుతారు. ఉమ్మడి జిల్లా నుంచి అనేకమంది కవులు, రచయితలు వర్ధమాన సాహితీవేత్తలు ఇందుకు తమ స్థాయిలో పాటుపడుతున్నారు. నేరెళ్ల హనుమంతు, తుమ్మల దేవరావు, దామెర రాములు, మడిపెల్లి రాజ్‌కుమార్, అల్లం రాజయ్య, వసంత్‌రావు దేశ్‌పాండే, మురళీధర్, చంద్రమౌళి, సామల రాజవర్ధన్, పోలీస్ భీమేష్, ఉదారి నారాయణ, తదితర అనేకమంది ఇదే కోవలోకే చెందినవారు కావడం విశేషం.

కవిత్వం సంక్షిప్తం...అర్థం అనంతం

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయులు పత్తి శివప్రసాద్ రచన ప్రత్యేకశైలి సంతరించుకుని ఉంటుంది. తెలంగాణ యాసలో సంక్షిప్త పదాలతో కూడిన వచన కవిత్వంలో వీరిది అందవేసిన చేయి. చిన్న చిన్న వాక్యాలు, పదాల్లో అనంతమైన అర్థం దాగి ఉండేలా వీరి రచనలు ఉంటాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన ఆయన కొన్నేళ్లుగా అవిశ్రాంత సాహితీసేవలో కొనసాగుతున్నారు. ఎనిమిది మాసాలుగా ప్రతీరోజు వీరి కలం వెంట విరిచితమవుతున్న రచనలు పలు సామాజిక మాధ్యమాల్లో సాహితీ అభిమానులు ఇష్టపడుతున్నారు.

చిట్టి రచనల్లో గట్టి అర్థం స్ఫూరించేలా...

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ గ్రామీణ జీవన నేపథ్యం యాస, భాష, నుడికారాలతో కూడిన కథల సంపుటిని సమష్టిగా రచించి ఏడాది క్రితం పుస్తకంగా విడుదల చేశారు.. తాజాగా మరి కొంతమంది విద్యార్థులు 'అంకురాలు–2' పేరిట మరో పుస్తకాన్ని విడుదల చేసేందుకు శ్రమిస్తున్నారు.. అక్కడి తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న మార్గనిర్దేశంలో చిన్నారులంతా కలిసి తెలంగాణ భాష, సంస్కృతిపై వారికున్న మక్కువతోనే కథల సంపుటిని రచించి త్వరలో పాఠకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. గతంలో విడుదల చేసిన తొలి కథల సంపుటిలో చక్కని గ్రామీణ నేపథ్యంతో కూడిన ఇతివృత్తాలను కథాంశాలుగా స్వీకరించి తెలంగాణ యాస, సంభాషణలను గ్రామీణ రైతుల కష్టాలు, జీవనవిధానం స్ఫూరించేలా చేసిన వీరి రచనలు రాష్ట్రస్థాయిలో పలువురు రచయితలు, సాహితీవేత్తల ప్రశంసలు పొందాయి.

నువ్వు లేక నేను లేను..!

- రైలు కింద పడి యువతి బలవన్మరణం
- తట్టుకోలేక ప్రేమికుడి ఆత్మహత్య
- బావిలో దూకిన యువకుడు



మృతుడు వినయ్‌బాబు(ఫైల్)



మృతురాలు హితవర్షిణి (ఫైల్)

లక్సెట్టిపేట/సికింద్రాబాద్: ఇద్దరిదీ ఒకే ఊరు.. మనసులు కలిశాయి. ప్రేమించుకున్నారు. మనువాడాలనీ అనుకున్నారు. ఏమైందో తెలియదు గానీ యువతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణాన్ని తట్టుకోలేక ఒక్క రోజు వ్యవధిలోనే యువకుడు బావిలో దూకి బలవన్మరణం చెందాడు. పోలీసులు, జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన వేనంక వినయ్‌బాబు(26) డిగ్రీ పూర్తి చేశాడు. తల్లి రాజవ్వతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన దుంపటి హితవర్షిణి(20) ఇంజినీరింగ్ చదువుతోంది. వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. హితవర్షిణి కుటుంబం ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఉంటోంది.

రైలు కిందపడి యువతి..

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి అంజన్న కూతురు దుంపటి హితవర్షిణి ఘట్‌కేసర్‌లోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ ఫైనలియర్ చదువుతోంది. సెలవుల కారణంగా మూడు రోజుల క్రితం ఆర్మూర్‌కు వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి మెట్రో రైలు ఎక్కి ఉప్పల్ స్టేషన్‌లో దిగింది. అక్కడి నుంచి ఆటోలో ఘట్‌కేసర్ చేరుకున్న హితవర్షిణి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై సిర్పూర్–కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపారు.

హనవ్వ దగ్గరికే వెళ్తున్నా..!

హితవర్షిణి మృతిని వేనంక వినయ్‌బాబు తట్టుకోలేకపోయాడు. మనోవేదనకు గురైన అతడు లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో సోమవారం దూకాడు. స్థానికులు గమనించి బావిలో నుంచి తీసేసరికి చనిపోయాడు. ''హనవ్వ(హితవర్షిణి) కోసం ఏం చేయడానికైనా సిద్ధం. నా పంచ ప్రాణాలు.. అందుకే హనవ్వ దగ్గరికే వెళ్తున్నా.. అమ్మా, నాన్న, బాబాయి నన్ను క్షమించండి'' అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

తెరుచుకున్న బాసర ఆలయం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: రాహుగ్రస్త చంద్రగ్రహణం అనంతరం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సోమవారం ఉదయం 4 గంటలకు తెరిచారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, మహాసంప్రోక్షణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషేకం, మహా నివేదన, మంత్రపుష్పం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులకు అన్ని అర్జిత సేవలు, సర్వ దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి.

11న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 11న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం నిర్మల్ నుంచి బోథ్‌కు చేరుకుని ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభిస్తారు. పరిచయ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల కింద ఎంపికైన నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. ఇంద్రవెల్లికి చేరుకుని అమరవీరుల స్తూపాన్ని ప్రారంభిస్తారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. మధ్యాహ్నం భోరజ్ మండలం పిప్పర్‌వాడకు చేరుకుని ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి గిమ్మకు చేరుకుని రూ.13.78 కోట్ల సీఆర్ఆర్, ఎస్‌సీపీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తారు. పట్టణంలోని గాయత్రీ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

సినీ ఫక్కీలో దాడికి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో కొందరు యువకులు సినీఫక్కీలో దాడి చేసేందుకు యత్నించారు. బాధితులు పారిపోవడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు ఈనెల 6న ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపూరకు చెందిన గణేశ్ మండలి సభ్యులు గ్రూప్‌గా విడిపోయి పరస్పరం దాడికి పాల్పడ్డారు. సోమవారం కోలిపూరకు చెందిన ఆకుల నితీష్ అలియాస్ టిక్కు, కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠ అదే కాలనీకి చెందిన కళ్యాణ్, మురార్కర్ నవీన్, కార్తీక్‌తో పాటు పలువురిపై దాడి చేసేందుకు సింహాద్రి సినిమాలో మాదిరి సైకిల్ గేర్‌విల్‌తో తయారు చేసిన ఆయుధంతో వెళ్లారు. గమనించిన బాధితులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. ఆ తర్వాత వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మురార్కర్ నవీన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠలను అరెస్టు చేయగా ఆకుల నితీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఈ ఆయుధాన్ని తయారు చేసిన వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తల్లిపై కుమారుడు హత్యాయత్నం

- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

తిర్యాణి: తల్లిపై కుమారుడు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తలండి గ్రామానికి చెందిన పులి భీమయ్యకు తన కుటుంబంతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ కుటుంబ సభ్యులతో భీమయ్య గొడవకు దిగేవాడు. ఆస్తికి అడ్డంగా ఉన్న తల్లి కాంతను చంపాలనే ఉద్దేశంతో ఈనెల 7న తెల్లవారు జామున ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యాడు. అప్రమత్తమైన వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. కాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం భీమయ్యను అదుపులోకి తీసుకుని ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు...

అన్నారం బ్యారేజీలో ఒకరు గల్లంతు

- నాటుపడవ బోల్తా పడడంతో ఘటన

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీలో డోంగ (నాటు పడవ) బోల్తా పడి ఒకరు గల్లంతైనట్లు పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని సిరోంచ తాలుకా మండలపురం గ్రామానికి చెందిన తూముకూరి కిష్టస్వామి, గడ్డం వెంకటేశ్ సోమవారం చెన్నూర్ మండలంలోని పొక్కూరు గ్రామానికి చెందిన చొంక సంపత్ వద్ద డోంగ (నాటు పడవ) కొనుగోలు చేశారు. అదే పడవపై ఇద్దరూ కలిసి గోదావరి నదిలో వెళ్తుండగా సుందరసాల సమీపంలోని అన్నారం బ్యారేజీ వద్దకు రాగానే నీటి ప్రవాహం ఎక్కువై పడవ తలకిందులై కొట్టుకు పోయింది. పడవలో ప్రయాణిస్తున్న కిష్టస్వామి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా వెంకటేశ్ బ్యారేజీలో గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం

రెబ్బెన: భార్య కాపురానికి రావడంలేదని భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి ఓదానందం (32)కు మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ధర్మారావుపేటకు చెందిన శైలజతో కొన్నేళ్లక్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో రెండు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం ఓదానందం తన భార్యకు నచ్చజెప్పి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులతో కలిసి అత్తారింటికి వెళ్లాడు. నిరాకరించిన శైలజ తన తల్లితో కలిసి వారిని దుర్భాషలాడింది. దీంతో తల్లిదండ్రులను తీసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం గదిలోకి వెళ్లాడు. సోమవారం ఉదయం నిద్రలేపేందుకు గది తలుపు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు శైలజతో పాటు ఆమె తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ పొలిమేరలోనే వాహనాలు



వాగుకు అవతల నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గౌరపూర్, చిత్తబట్ట గ్రామాలకు మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మించకపోవడంతో వర్షాకాలంలో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల పాటు తమ ద్విచక్ర వాహనలు, ఆటోలను వాగుకు అవతల ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటువైపు వ్యవసాయ భూములున్న రైతులు, గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చిత్తబట్ట వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.



గౌరపూర్, చిత్తబట్ట గ్రామాల మధ్యలో వాగు

అర్జీదారుల దరఖాస్తులు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం పీవో చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన నిఖిల్ ల్యాప్‌టాప్ ఇప్పించాలని, సోనాల మండలం దేవునాయక్ తండాకు చెందిన లక్ష్మణ్ ఆర్వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, తాండూర్‌కు చెందిన విజయలక్ష్మి ట్రైకార్ రుణం ఇప్పించాలని, నార్నూర్ మండలం కొలాంగూడకు చెందిన జంగు టెంట్ హౌజ్ కోసం, గాదిగూడకు చెందిన శిరీష ఇల్లు మంజూరు కోసం అర్జీలు సమర్పించారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ల్యాప్‌టాప్‌లు పంపిణీ

ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రతిభ కనబర్చిన ఉట్నూర్ మండలంలోని ఎనిమిది మంది గిరిజన విద్యార్థులకు సోమవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసినట్లు పీవో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మాడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జక్కుల అశ్విన్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 7న గోలేటిలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 4వ సబ్ జూనియర్ బాలబాలికల అండర్–14 పోటీల్లో ప్రతిభ కనబరిచి జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సదరు విద్యార్థిని సోమవారం అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ జిల్లా కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మందమర్రి సీఐఎస్ఎఫ్ బరాక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 2వ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సదరు పాఠశాల విద్యార్థినులు అశ్విత, పి.నేహ, ఆర్.మనస్విని స్వర్ణ పతకాలు, బి.సింధు, ఎస్, కీర్తన, బి.అక్షర, హన్సిత, లౌక్యశ్రీలు రజత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సదరు విద్యార్థులను, కరాటే మాస్టర్ రవిని ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

15న లాభాల వాటా కోసం ధర్నా

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికులకు కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ కేంద్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. సోమవారం ఆర్కే 5 గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. కంపెనీ లాభాల వాటా చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ఏప్రిల్ 1నే ఉత్పత్తిని ప్రకటిస్తున్న అధికారులు లాభాలను మాత్రం ప్రకటించడానికి నెలలు గడుపుతున్నారన్నారు. వాస్తవ లాభాలను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో సొంతింటి పథకంపై తమ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల అభిప్రాయ సేకరణకు బ్యాలెట్ విధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు వెంగల శ్రీనివాస్, సురేందర్, ఇప్ప నరేష్, తిరుపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజారెడ్డి

35 శాతం లాభాల వాటా ఇవ్వాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

కాసిపేట: గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన లాభాలు ప్రకటించి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత సీఅండ్ఎండీతో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో సొంతింటి పథకం అమలు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంటీలను విధుల్లోకి తీసుకునేందుకు సర్క్యులర్ జారీ అయ్యిందన్నారు. ఇతర ఉద్యోగులకు సైతం ఐదేళ్లలో వంద మస్టర్లు ఉంటే విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. ఈనెల 12న సీఅండ్ఎండీతో జరిగే సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రాజేందర్, లింగయ్య, రఘురాం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య


నవజాత శిశువు మృతి

భీంపూర్: మండలంలోని భగవాన్‌పూర్‌లో నవజాత శిశువు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రియాంకకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో అంబులెన్స్ రావడంలో ఆలస్యమైంది. దీంతో మహిళ ఇంటివద్దే ప్రసవించగా శిశువు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుమార్గాన్ని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్..

కుభీర్: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని లింగి గ్రామానికి చెందిన కె.గంగాధర్ (33) సోమవారం సాయంత్రం ఆటోలో సిమెంటు బస్తాలు వేసుకుని భైంసా నుంచి వస్తుండగా సాంవ్లి గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో మహిళ..



జానాబాయి (ఫైల్)

వాంకిడి: పొలం పనులకు వెళ్లిన ఓ మహిళను పాము కాటువేయడంతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వడ్మరే జానాబాయి(34), శంకర్ దంపతులు ఆదివారం పంటచేనుకు వెళ్లారు. సాయంత్రం పనులు చేస్తుండగా జానాబాయిని పాము కాటు వేసింది. ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.